ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
బుధవారం, 23 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 36 | పేజీలు: 4 వెల: 5




# దళితులు, గిరిజనులకు భరోసా

ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాల్లో పెద్దపీట

## ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం

- అట్రాసిటీ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- సత్వపరిహారం వెంటనే చెల్లించాలి..
- గ్రీన్ ఛానెల్‌లో నిధులు
- అత్యధిక కేసులున్న 73 గ్రామాలపై ప్రత్యేక నిఘా
- హైలెవెల్ కమిటీ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశమైంది. చట్టం అమలు, కేసుల దర్యాప్తు, కోర్టు విచారణలు, పరిష్కారం, బాధితులకు పరిహారం, పునరావాస చర్యలపై సమీక్షించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ స్థాయి కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదని

........(తరువాయి 2లో)



# రెబ్బెన గోదాం నుంచే రేషన్ దందా!

పట్టణ శివారులోనే భారీ స్టాకు పాయింట్

> ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న పీడీఎస్ బియ్యం దందాపై వరుసగా వెలుగులోకి వస్తున్న సమాచారం కలకలం రేపుతోంది. ఆసిఫాబాద్‌కు చెందిన రేషన్ డాన్.. రెబ్బెన పట్టణ శివారులోని ఓ గోదాం నుంచే వ్యవహారం నడిపిస్తున్నట్లుగా తెలుస్తోంది. చిన్న వ్యాపారులు, పీడీఎస్ కలెక్షన్ ఏజెంట్లు తాము సేకరించిన బియ్యాన్ని విడతలవారీగా ఈ గోదాంకు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ స్టాక్‌ను తూకం వేసి సంచుల్లో నింపడం.. రాత్రివేళల్లో లారీలకు లోడ్ చేసి సరిహద్దులు దాటించడం జరుగుతున్నట్లు సమాచారం.

## పీడీఎస్ బియ్యం తూకాలు.. ప్యాకింగ్ అక్కడే

- చిన్న వ్యాపారులు, ఏజెంట్ల నుంచి చేరుతున్న రైస్
- అవసరానికి తగ్గట్టుగా చుట్టు పక్కల ప్రదేశాల్లో స్టాక్ పాయింట్ల ఏర్పాటు
- రాత్రివేళల్లో గోదాం నుంచి లారీల్లో తరలింపు
- రైళ్లలోనూ మిల్లుల పేరుతో లోడింగ్..?
- పదుల సంఖ్యలో ఏజెంట్లతో రేషన్ డాన్ భారీ నెట్‌వర్క్
- స్మగ్లర్‌కు సలాం కొడుతున్న ఆఫీసర్లపై ఉత్తరం కాకతీయకు సమాచారం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** లారీలతోపాటు కొన్ని సందర్భాల్లో మిల్లుల పేరుతో రైళ్లలోనూ బియ్యం లోడింగ్ చేస్తున్నట్లు తెలుస్తుండటంతో వ్యవహారం ఏ స్థాయిలో విస్తరించిందని తెలుస్తుండటం విస్తుగొల్పుతోంది. మరోవైపు ప్రధాన గోదాంకు స్టాక్ చేరకముందే చిన్న మొత్తాల్లో నిల్వ చేసేందుకు పలు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా సమాచారం.

**గోదాంలోనే తూకాలు.. ప్యాకింగ్**

రెబ్బెన పట్టణ శివారులోని గోదాంలో పీడీఎస్ బియ్యం చేరిన తర్వాత తూకం వేసి సంచుల్లో నింపుతున్నట్లు సమాచారం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే స్టాక్‌ను ఒకచోట చేర్చి, అవసరానికి అనుగుణంగా లారీలకు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. పగటి సమయంలో పెద్ద మొత్తంలో కదలికలు లేకుండా, రాత్రివేళల్లో వాహనాలను సిద్ధం చేసి తరలించే విధానం కొనసాగుతున్నట్లు సమాచారం. గోదాంకు వచ్చే స్టాక్, అక్కడి నుంచి బయటకు వెళ్లే వాహనాల వివరాలను పరిశీలిస్తే వ్యవహారం వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రధాన గోదాం ఒక్కటే కాకుండా రేషన్ డీలర్లు, పీడీఎస్ కలెక్షన్ ఏజెంట్లకు అనువుగా చిన్న మొత్తాల్లో బియ్యం నిల్వ చేసే పాయింట్లను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

........(తరువాయి 2లో)




3

## ప్రేయ ఇన్‌ఫ్రా పేరుతో భారీ పెట్టుబడి మోసం

- కోట్లాది రూపాయలు సేకరించి చెల్లింపులు నిలిపివేత
- ప్రధాన నిందితుడు సహా ముగ్గురు అరెస్ట్
- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అభినందన

# నేడు భారీ వర్షాలు

- 8జిల్లాలకు రెడ్ అలర్ట్.. 20 జిల్లాలకు భారీ వర్ష సూచన
- హైదరాబాద్‌లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం.. 40 కి.మీ. వేగంతో గాలులు
- ఏపీ తీరానికి వాయుగుండం ముప్పు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. 8 జిల్లాలకు రెడ్ అలర్ట్, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన

........(తరువాయి 3లో)



## నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు

- నోరి లక్ష్మీ భాస్కర్ పేరిట రూ.6.13 కోట్ల ఆస్తులు గుర్తింపు
- హైదరాబాద్‌లో 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఫ్లాట్‌లు, ఓపెన్ ప్లాట్లు, బ్యాంకు బ్యాలెన్స్‌లు.. బంగారు ఆభరణాలు
- 4 కార్లు, 2 ద్విచక్ర వాహనాలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు
- డీఆర్‌టీకి ముందు ప్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి
- ఇతరులకు రూ.1.33 కోట్లు అప్పుగా ఇచ్చినట్లు ఏసీబీ వెల్లడి

3

## వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం

- హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తి చేశాం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఫిల్టర్‌బెడ్‌కు ప్రాధాన్యం
- అభివృద్ధిపై విమర్శలు కాదు.. డేటాతో చర్చకు సిద్ధం
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




3

# ఎంజీఎంలో ఉద్రిక్తత

- ఆస్పత్రిలోకి వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే దాస్యంను అడ్డుకున్నపోలీసులు
- భవనాలకు పెచ్చులూడటాన్ని పరిశీలించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు
- అనుమతి లేదంటూ ఎంజీఎం ప్రాంగణంలోనే నిలిపిన పోలీసులు
- రోగులను పరామర్శించేందుకు వెళ్లనివ్వాలని కోరిన మాజీ ఎమ్మెల్యే
- నిరాకరించడంతో బీఆర్ఎస్ శ్రేణులకు పోలీసులకు మధ్య తోపులాట
- పెనుగులాట, తొక్కిసలాటలో వినయ్‌భాస్కర్ కాలు, చేతికి తీవ్ర గాయాలు..రక్తస్రావం
- నాకు ఎంజీఎంలోనే చికిత్స చేయాలంటూ పట్టు
- గంటపాటు ఎంజీఎం ఎదుట కొనసాగిన హైటెన్షన్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతల ఆందోళన..!



**కాకతీయ, వరంగల్:** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, మౌలిక

........(తరువాయి 2లో)

- తూప్రాన్‌పేటలోనే ఎందుకీ గందరగోళం?
- 22ఏ జాబితాలో కనిపించని భూములు
- 5.5 ఎకరాలు అప్‌లోడ్.. 40 ఎకరాల సంగతేంటి?
- రిజిస్ట్రేషన్ యత్నంతో బయటపడిన వ్యవహారం
- నయీం ఆస్తులు చేతులు మారుతున్నాయా?



# నయీం ఆస్తుల లెక్క తారుమారు!

## 327 ఆస్తులపై జీవో.. గెజిట్ జారీ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తుల లెక్కలు మాయమవుతున్నాయా? ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చాలని స్పష్టంగా ఆదేశించిన ఆస్తుల్లోనే కొన్ని వివరాలు రికార్డుల్లో కనిపించకపోవడం వెనుక ఏముంది? నయీంకు చెందిన 327 ఆస్తులను 22ఏ(1)(ఈ) కింద చేర్చాలని జీవో జారీ చేసి.. గెజిట్ కూడా విడుదల చేసినా.. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని భూముల విషయంలో మాత్రం రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేకపోవడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. 5.5 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించిన సమయంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం.. అధికార

........(తరువాయి 2లో)



3

## రిమ్స్ పిల్లల వార్డులో పేలిన ఏసీ

- ఎస్ఎన్‌సీయూలో ఏసీ నుంచి ఒక్కసారిగా పొగలు
- ప్రమాద సమయంలో 27 మంది నవజాత శిశువులు
- వెంటిలేటర్‌పై ఉన్న ట్రీటర్స్ బేబీ, మరో పసికందు మృతి
- అద్దాలు పగలగొట్టి పసికందులను రక్షించిన సిబ్బంది
- ప్రైవేట్ ఆస్పత్రులకు హుటాహుటిన తరలింపు
- ఘటనాస్థలికి కలెక్టర్ రాజర్షి, ఎస్పీ.. సహాయక చర్యల పర్యవేక్షణ

# రెబ్బెన గోదాం నుంచే రేషన్ దందా!

**(మొదటిపేజీ తరువాయి)**



ఆయా ప్రాంతాల్లో స్టాక్ సమకూరిన తర్వాత పరిస్థితిని బట్టి రెబ్బెన శివారులోని గోదాంకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకేసారి పెద్ద మొత్తంలో బియ్యం ఒకచోట కనిపించకుండా విడతలవారీగా తరలింపు సాగుతున్నట్లు సమాచారం. ఈ పాయింట్లు ఎక్కడున్నాయి? వాటిలో ఎంత స్టాక్ నిల్వ చేస్తున్నారు? ఎవరి ఆధ్వర్యంలో నడుస్తున్నాయి? అనే వివరాలు బయటకు వస్తే నెట్‌వర్క్ విస్తృతి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**మిల్లును వదిలి.. ఏజెంట్ల వ్యవస్థ**

గతంలో సదరు రేషన్ స్మగ్లర్ ఓ మిల్లును లీజుకు తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ మిల్లును వదిలేసి పదుల సంఖ్యలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్టాక్ సేకరణ బాధ్యతలను ఏజెంట్లకు అప్పగించి, అవసరమైనప్పుడు వాటిని ప్రధాన గోదాంకు చేరుస్తున్నట్లు సమాచారం. దీంతో ఒకే కేంద్రం నుంచి మొత్తం వ్యవహారం నడిపిన పాత విధానానికి బదులుగా విస్తృత ఏజెంట్ నెట్‌వర్క్ ఏర్పడినట్లు తెలుస్తోంది. ఈ ఏజెంట్ల వివరాలు, వారి ఆధీనంలోని స్టాక్ పాయింట్లు, గోదాంకు పంపుతున్న పరిమాణాలపై సివిల్ సప్లైస్ శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**రాత్రి వేళకు లోడింగ్ సిద్ధం..**

గోదాంలో తూకం, ప్యాకింగ్ పూర్తయిన తర్వాత రాత్రివేళల్లో లారీలకు బియ్యం లోడ్ చేస్తున్నట్లు సమాచారం. పగటిపూట సేకరణ, నిల్వ ప్రక్రియ సాగుతుండగా రాత్రివేళల్లో రవాణాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. లారీల రాకపోకలు, లోడింగ్ సమయాలు, వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలు, గోదాం పరిసరాల్లోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది. ముఖ్యంగా ఒకే ప్రాంతం నుంచి నిరంతరంగా వాహనాలు కదులుతున్నట్లయితే వాటిపై సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయన్నది ప్రశ్నగా మారుతోంది. లారీల ద్వారా మాత్రమే కాకుండా కొన్ని సందర్భాల్లో మిల్లుల పేరుతో రైళ్లలోనూ బియ్యం లోడింగ్ చేసి మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్షా ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. సిర్పూర్ నుంచి రైళ్ల ద్వారా రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. మిల్లుల పేరుతో రవాణా చేస్తున్నట్లయితే సంబంధిత మిల్లుల స్టాక్ రిజిస్టర్లు, రవాణా అనుమతులు, బిల్లులు, లోడింగ్ వివరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. వాస్తవంగా ఏ మిల్లుకు సంబంధించిన బియ్యం? పీడీఎస్ స్టాక్ ఎలా ఆ సరఫరా గొలుసులోకి చేరింది? అనే అంశాలపై రికార్డుల ఆధారంగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**సహకారం ఎవరిది?**

రెబ్బెన శివారులో గోదాం, దానికి అనుసంధానంగా చిన్న స్టాక్ పాయింట్లు, వాటి నుంచి బియ్యం సేకరించే ఏజెంట్లు, అక్కడి నుంచి రాత్రివేళల్లో రవాణా.. ఇలా దశలవారీ వ్యవస్థ ఉన్నట్లు సమాచారం వస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నిఘా ఎంతవరకు ఉందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ముఖ్యంగా రేషన్ డీలర్ల స్థాయిలో బియ్యం సేకరణ, మధ్యంతర స్టాక్ పాయింట్లు, ప్రధాన గోదాం, లారీ లోడింగ్, రైలు రవాణా వరకు ప్రతి దశలో రికార్డులను పరిశీలించాల్సి ఉంది. సదరు స్మగ్లర్‌కు గతంలో సహకరించని పోలీసులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర ఉందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్నతస్థాయి పోలీసు అధికారులతోనూ సంబంధాలు ఉన్నట్లు సమాచారం వినిపిస్తోంది. అయితే ఈ అంశాన్ని అధికారికంగా నిర్ధారించే ఆధారాలు అందుబాటులో లేవు. అయినప్పటికీ ఒకవేళ పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతున్నట్లయితే పోలీసు శాఖకు చెందిన నిఘా విభాగాలు, స్థానిక పోలీసులు ఇప్పటివరకు గుర్తించిన వివరాలేమిటన్నది ప్రశ్న. గోదాం, వాహనాలు, రాత్రివేళల్లో జరిగే కదలికలపై సమాచారం ఉన్నా చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న దానిపైనా స్పష్టత రావాల్సి ఉంది.

**సివిల్ సప్లైస్ అధికారుల నిఘా ఎక్కడ?**

పీడీఎస్ బియ్యం సేకరణ, నిల్వ, తరలింపు మొత్తం వ్యవహారం సివిల్ సప్లైస్ శాఖ పరిధిలోనూ కీలకంగా ఉంటుంది. రేషన్ డీలర్ల వద్ద పంపిణీ రికార్డులు, లబ్ధిదారులకు అందిన పరిమాణం, మిగిలిన స్టాక్, ఏజెంట్ల కదలికలు, గోదాం వద్ద జరుగుతున్న తూకాలు, ప్యాకింగ్ వంటి అంశాలను పరస్పరం సరిపోల్చితే లెక్కల్లో తేడాలు బయటపడే అవకాశం ఉంది. రెబ్బెన శివారులోని గోదాం, అనుమానిత స్టాక్ పాయింట్లపై తనిఖీలు చేపట్టి వాస్తవ పరిస్థితిని అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. కేవలం పట్టుబడిన బియ్యంతోనే వ్యవహారాన్ని ముగించకుండా, సేకరణ నుంచి తుది రవాణా వరకు ఉన్న గొలుసును ఛేదించాల్సి ఉంది.

**ఉత్తరం కాకతీయకు ఫోన్లు..**
**కీలక సమాచారం**

రేషన్ డాన్ వ్యవహారంపై ఉత్తరం కాకతీయకు పలువురు ఫోన్ చేసి తమకు తెలిసిన వివరాలను వెల్లడించడం గమనార్హం. రెబ్బెన శివారులోని గోదాం, అక్కడ జరిగే తూకాలు, స్టాక్ పాయింట్లు, ఏజెంట్ల వ్యవస్థ, రాత్రి వేళల్లో జరిగే లోడింగ్ వంటి అంశాలను వారు వివరించారు. స్మగ్లర్‌కు ఎవరి నుంచి సహకారం అందుతోంది? ఎవరు అతడి నెట్‌వర్క్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారు? అనే వివరాలను కూడా తమకు తెలిసిన మేరకు పంచుకున్నారు. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన కొత్త సమాచారం ప్రకారం పీడీఎస్ బియ్యం దందాలో ప్రధానంగా కనిపిస్తున్నది రెబ్బెన శివారులోని గోదాం, దానికి అనుసంధానమైన చిన్న స్టాక్ పాయింట్లు, వాటిని కలుపుతున్న ఏజెంట్ల వ్యవస్థతో పక్కా నెట్వర్క్‌ను స్మగ్లర్ ఏర్పాటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ మూడు దశలపై సమగ్ర తనిఖీ జరిగితేనే దందా అసలు పరిమాణం స్పష్టమయ్యే అవకాశం ఉంది. గోదాంలో తూకం వేసిన బియ్యం ఎంత? ఏ ప్రాంతాల నుంచి వచ్చింది? ఎవరెవరు తెచ్చారు? ఎన్ని వాహనాల్లో బయటకు వెళ్లింది? రైళ్లలో ఏ పేరుతో లోడింగ్ చేశారు? అన్న రికార్డులను అధికారులు పరిశీలించాల్సి ఉంది. యథేచ్ఛగా సాగుతున్నట్లు వస్తున్న సమాచారానికి తెరదించాలంటే పోలీసు, సివిల్ సప్లైస్ శాఖలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అసలు గోదాం నుంచి బయటకు వెళ్తున్న ప్రతి సంచి లెక్క తేలితేనే.. ఈ దందా వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఎంత పెద్దదో స్పష్టమవుతోంది.





# ఎంజీఎంలో ఉద్రిక్తత

**(మొదటిపేజీ తరువాయి)**

వసతుల కొరత, రోగుల ఇబ్బందులను పరిశీలించేందుకు వెళ్లిన ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో వినయ్‌భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తస్రావం జరిగినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. రోగులను పరామర్శించేందుకు అనుమతించాలని ఆయన కోరినా పోలీసులు నిరాకరించినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రధాన గేటు వద్ద గంటపాటు హైటెన్షన్ నెలకొంది. ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో ఇటీవల పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు సహా పలువురు గాయపడిన ఘటన కలకలం రేపింది. దీంతో ఆస్పత్రి భవనాల భద్రత, నిర్వహణపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఎంజీఎంలో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు, భవనాలకు పెచ్చులు ఊడిపడుతున్న తీరును పరిశీలించేందుకు వినయ్‌భాస్కర్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆస్పత్రికి వచ్చారు.



**వినయ్‌భాస్కర్‌ను లోనికి వెళ్లకుండా ఎంజీఎం వద్ద అడ్డుకుంటున్న పోలీసులు**

**గేటు వద్దే అడ్డుకున్న పోలీసులు**

వినయ్‌భాస్కర్ ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదంటూ లోపలికి వెళ్లనివ్వలేదు. రోగులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన తనను ఎందుకు అడ్డుకుంటున్నారని వినయ్‌భాస్కర్ ప్రశ్నించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. అనుమతిపై స్పష్టత రాకపోవడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో గేటు పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం అనంతరం తోపులాట జరిగింది. కార్యకర్తలను పోలీసులు నిలువరించే ప్రయత్నం చేయడంతో పెనుగులాట, తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే వినయ్‌భాస్కర్ కాలు, చేతికి తీవ్ర గాయాలై రక్తస్రావమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

**పోలీసులపై వినయ్‌భాస్కర్ ఆగ్రహం**

తనపై పోలీసులు దాడి చేశారని వినయ్‌భాస్కర్ ఆరోపించారు. తోపులాటలో గాయపడటంతోపాటు కడుపులో తన్నారని, చేతికి గాయమైందని కన్నీటి పర్యంతమైనట్లు ఆయన వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వ కనుసన్నల్లోనే పోలీసులు తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. తనను ప్రభుత్వ ఆస్పత్రి ఎంజీఎంలో కాకుండా ప్రైవేటు ఆస్పత్రికి తరలించడంపైనా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. తనకు ఎంజీఎంలోనే చికిత్స అందించాలని, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లవద్దని వినయ్‌భాస్కర్ పట్టుబట్టినట్లు తెలిపారు. ఎంజీఎంలో పేద ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందడం లేదని వినయ్‌భాస్కర్ విమర్శించారు. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడం, భవనాల పైకప్పులు పెచ్చులూడిపడటం, అంబులెన్స్‌ల కొరత వంటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆరోగ్యశ్రీ వార్డులో పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటన మరవకముందే మరో వార్డులోనూ ఇలాంటి పరిస్థితులు కనిపించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రోగులకు వైద్యం అందించాల్సిన ఆస్పత్రిలోనే వారి భద్రతకు భరోసా లేకపోవడం దారుణమన్నారు.

**మహిళల నిలదీత.. గంటపాటు హైటెన్షన్**

వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంపై అక్కడున్న కొందరు మహిళలు కూడా పోలీసులను ప్రశ్నించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. ఎంజీఎంలో కనీస వసతులు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన వినయ్‌భాస్కర్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారని వారు నిలదీసినట్లు పేర్కొన్నారు. రోగులకు సరైన వైద్యం, కనీస సౌకర్యాలు కల్పించాలని మహిళలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధి రోగుల సమస్యలను తెలుసుకునేందుకు వస్తే అడ్డుకోవడం సరికాదని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలను పోలీసులతో అడ్డుకోవడం తగదని వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.



# దళితులు, గిరిజనులకు భరోసా

**(మొదటిపేజీ తరువాయి)**

గుర్తుచేశారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**ఇళ్ల కేటాయింపులోనూ ప్రాధాన్యం**

రాష్ట్రంలో ఎస్సీల జనాభా దాదాపు 16 శాతం ఉండగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 31 శాతం మంది ఎస్సీ వర్గాల లబ్ధిదారులు ఉన్నారని సీఎం వివరించారు. ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే వారికి 17 శాతం ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలపై నమోదవుతున్న అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుతున్నట్లు అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు వివరించారు. ఆయా గ్రామాలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పరిహారం కోసం గ్రీన్ ఛానెల్**

అట్రాసిటీ కేసుల బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని సూచించారు. బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, సకాలంలో పరిహారం, సహాయం, పునరావాసం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో పరిహారం, పునరావాసం కీలక అంశాలుగా సమావేశంలో సమీక్షించారు. అట్రాసిటీ కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుపైనా సమావేశంలో చర్చించారు. నమోదైన కేసుల దర్యాప్తు ఏ దశలో ఉంది? కోర్టుల్లో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని పరిష్కారమయ్యాయి? బాధితులకు ఆర్థిక సహాయం ఎంతవరకు అందింది? వంటి అంశాలను సమీక్షించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలపైనా చర్చ జరిగింది.

**షాబాద్, తుక్కుగూడ కేసుల ప్రస్తావన**

ఇటీవల జరిగిన షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా ఘటనల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ ఘటనల్లో కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. చదువు ఒక్కటే జీవితాలను మార్చగలదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యతోనే సమాజంలో అసమానతలు, అణిచివేతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. పిల్లలను చదువుతోపాటు క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజలదేనని, వారి సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు.

**కమిటీలో పలువురు ప్రముఖులు**

సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- రోడ్లు, జంక్షన్లలో నీరు నిలవకుండా చర్యలు
- హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన నేపథ్యంలో సీఎం ఆదేశాలు

**కాకతీయ, హైదరాబాద్:** హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో సిబ్బంది, యంత్రాలను వెంటనే రంగంలోకి దించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, ట్రాఫిక్ నిలిచిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# నయీం ఆస్తుల లెక్క తారుమారు..!



**(మొదటిపేజీ తరువాయి)**

యంత్రాంగం హడావుడిగా ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం మరిన్ని ప్రశ్నలకు దారితీస్తోంది. అదే సమయంలో మరో సర్వే నంబర్‌లోని దాదాపు 40 ఎకరాల భూమి ఇంకా ప్రొహిబిటెడ్ జాబితాలో ఎందుకు స్పష్టంగా కనిపించడంలేదన్నది చర్చనీయాంశంగా మారింది. నయీం బెదిరింపులు, అరాచకాలతో భూములు కూడబెట్టుకున్నాడని పలువురు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతోపాటు కోర్టులను ఆశ్రయించారు. నయీం తన భార్య, బంధువులు, అనుచరుల పేర్లతో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించినట్లు దర్యాప్తు సంస్థల కేసుల్లో అంశాలు ఉన్నాయి. 2020 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో నయీం మరణించిన తర్వాత అతడి ఆస్తులపై సిట్, ఈడీ తదితర సంస్థల దర్యాప్తులు కొనసాగాయి. ఈ నేపథ్యంలో నయీంకు చెందిన 327 ఆస్తులను 22ఏ(1)(ఈ)లో చేర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.

**గెజిట్ ఉంది.. జాబితాలో లేవు**

ప్రభుత్వం జీవో నంబర్ 206 జారీ చేసి.. అనంతరం గెజిట్ నంబర్ 149ను విడుదల చేసింది. గెజిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ వెబ్‌సైట్‌లోని ప్రొహిబిటెడ్ జాబితాలో నమోదు చేయాల్సి ఉంది. యాదాద్రి జిల్లాలోని పలు ఆస్తులను 22ఏ(1)(ఈ)లో అప్‌లోడ్ చేసినా.. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని కొన్ని భూముల వివరాలు మాత్రం కనిపించకపోవడం ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. తూప్రాన్‌పేటలోని సర్వే నంబర్ 13ఏ, 14లో 5.5 ఎకరాల భూమి ఉంది. క్షేత్రస్థాయిలో అది ఖాళీ ప్లాట్లుగా ఉన్నప్పటికీ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉన్నట్లు సమాచారం. ఈ భూమిలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొందరు శుక్రవారం చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. ఈడీ కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ చేయలేమని సబ్ రిజిస్ట్రార్ చెప్పినా.. రికార్డుల్లో భూములు నిషేధిత జాబితాలో లేవని వారు వాదించినట్లు తెలుస్తోంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ వ్యవహారాన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు.

**సీసీఎల్ఏ ఆరా.. షోకాజ్ నోటీసు**

తూప్రాన్‌పేట భూముల వివరాలు 22ఏ జాబితాలో ఎందుకు కనిపించలేదన్న అంశంపై సీసీఎల్ఏ నుంచి జిల్లా అధికారులకు వివరణ కోరుతూ ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. మరోవైపు గెజిట్‌లో పేర్కొన్న ఆస్తులను ప్రొహిబిటెడ్ లిస్టులో ఎందుకు చేర్చలేదని చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయికి శుక్రవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా రెవెన్యూ అధికారులు హడావుడిగా రికార్డులను పరిశీలించారు. వివాదం ముదరడంతో యాదాద్రి జిల్లా రెవెన్యూ అధికారులు శనివారం రాత్రంతా కసరత్తు చేసినట్లు సమాచారం. సర్వే నంబర్లు 13ఏ, 14లోని 5.5 ఎకరాల భూమి వివరాలను ఆదివారం ఉదయం 7.45 గంటలకు ప్రొహిబిటెడ్ సైట్‌లో అప్‌లోడ్ చేశారు. వివాదం వెలుగులోకి వచ్చిన వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయడం ఇప్పుడు చర్చకు దారితీసింది. అసలు గెజిట్‌లో ఉన్న ఆస్తి ఇంతకాలం ఆన్‌లైన్ జాబితాలో ఎందుకు కనిపించలేదన్నదే ప్రశ్న.

**ఆస్తులు చేతులు మారుతున్నాయా?**

తూప్రాన్‌పేటలో మరో సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 40 ఎకరాల భూమి వివరాలు మాత్రం ఇంకా అప్‌లోడ్ కాలేదని తెలుస్తోంది. ఈ భూమికి సంబంధించి సిట్ నుంచి ఎన్‌వోసీ వచ్చిందని కొందరు అధికారులు చెబుతున్నట్లు సమాచారం. దర్యాప్తు సంస్థల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాతే ఆ భూములు చేతులు మారాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ 40 ఎకరాలు ప్రొహిబిటెడ్ సైట్‌లోని కోర్టు కేసుల విభాగంలో కనిపిస్తున్నట్లు సమాచారం. నయీం ఆస్తులను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చాలని ఆదేశించిన నేపథ్యంలో.. అవి సురక్షితంగా ఉన్నాయా? ఇప్పటికే చేతులు మారాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తూప్రాన్‌పేటలో 5.5 ఎకరాల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం, రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నం జరగడం, ఆ తర్వాత హడావుడిగా వివరాలు అప్‌లోడ్ చేయడం.. మొత్తం వ్యవహారంపై మరిన్ని ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ఇది అధికారుల నిర్లక్ష్యమా? సాంకేతిక లోపమా? లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఆస్తులను జాబితాలోకి రాకుండా అడ్డుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది.

**మిగిలిన జిల్లాల్లోనూ తనిఖీ అవసరం**

నయీంకు సంబంధించిన ఆస్తులు యాదాద్రితోపాటు రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట, మెదక్, మహబూబ్‌నగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్నట్లు సమాచారం. తూప్రాన్‌పేట వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ జిల్లాల్లోని ఆస్తుల వివరాలు కూడా గెజిట్‌తో సరిపోల్చి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. 327 ఆస్తుల జాబితాలో ఏ ఒక్క ఆస్తి వివరమూ మిస్ కాకుండా సమగ్రంగా ధ్రువీకరించాల్సి ఉంది. లేనిపక్షంలో నయీం ఆస్తుల రక్షణ కోసం తీసుకున్న ప్రభుత్వ చర్యలే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

# వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం

- హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ పూర్తి చేశాం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఫిల్టర్‌బెడ్‌కు ప్రాధాన్యం
- అభివృద్ధిపై విమర్శలు కాదు.. డేటాతో చర్చకు సిద్ధం
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**కాకతీయ, హనుమకొండ :** ప్రజా ప్రభుత్వంలో వరంగల్ నగరానికి కొత్త రూపు తీసుకొస్తామని, హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలో కీలక నగరంగా తీర్చిదిద్దుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నగర అభివృద్ధిపై తాము చేస్తున్న పనులే సమాధానమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో నాయిని మాట్లాడారు. సోమవారం రాత్రి వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి పనికీ గడువు నిర్ణయించి, ఎప్పటిలోగా పూర్తి చేయాలో స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించినట్లు చెప్పారు. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఒడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని నాయిని తెలిపారు. జీవోలు ఇచ్చి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని అన్నారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన చర్యలు ముందుకు సాగలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు నిధులు విడుదల చేసి ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. సేకరించిన భూమిని ఏఏఐకి అప్పగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది.

**ఫిల్టర్‌బెడ్‌తో భవిష్యత్ అవసరాలకు నీటి భద్రత**

ఒడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌కు సుమారు రూ.550 కోట్ల ప్రాజెక్టును తీసుకొచ్చామని, టెండర్లు పూర్తయి పనులు ప్రారంభమయ్యాయని నాయిని చెప్పారు. మెటీరియల్ సైతం సైట్‌కు చేరుతోందన్నారు. 30-40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. చిన్నచిన్న పనులు చేసి ఫొటోలు దిగడం కాకుండా భవిష్యత్ అవసరాలకు సరిపోయే భారీ ప్రాజెక్టులను చేపడుతున్నామని స్పష్టం చేశారు. వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు నాయకులు రాజకీయ విమర్శలు చేస్తున్నారని నాయిని అన్నారు. గత పదేళ్లలో వరంగల్‌కు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌సిటీ నిధులు వచ్చినా పూర్తిస్థాయిలో ఎందుకు వినియోగించలేకపోయారో గత పాలకులు సమాధానం చెప్పాలన్నారు. గత పాలనలో అవినీతి, ఆస్తుల వ్యవహారాలపై తాను చేసిన ప్రశ్నలకు సంబంధిత నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. సోషల్ మీడియాలో ఒక అబద్ధాన్ని పదిసార్లు ప్రచారం చేసినంత మాత్రాన అది నిజం కాదన్నారు. ప్రజలు ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం విమర్శలు చేస్తున్నారో గమనిస్తున్నారని చెప్పారు.

**గాంధీ కుటుంబంపై వ్యాఖ్యలను సహించం**

మామునూరు విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని నాయిని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని విమర్శించారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. విమర్శలు చేసే ముందు తమ చరిత్రను చూసుకోవాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని నాయిని విమర్శించారు. రామ మందిరంలో చోరీకి పాల్పడిన వారు బీజేపీ నాయకులేనని వ్యాఖ్యానించారు. వ్యక్తిగత విమర్శలు, రాజకీయ డ్రామాల కంటే వరంగల్ అభివృద్ధిపై చర్చకు రావాలని, తాము డేటాతో కూడిన పూర్తి ప్రోగ్రెస్ రిపోర్టును ప్రజల ముందు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల దసరాలోపు వరంగల్‌కు రానున్నారని, కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని నాయిని తెలిపారు. వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, అనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ రాణి, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, విజయశ్రీ రజాలి, జక్కుల రవీందర్‌యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

# శ్రేయా ఇన్‌ఫ్రా పేరుతో భారీ పెట్టుబడి మోసం

- కోట్లాది రూపాయలు సేకరించి చెల్లింపులు నిలిపివేత
- ప్రధాన నిందితుడు సహా ముగ్గురు అరెస్ట్
- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం అభినందన




**కాకతీయ, కరీంనగర్:** శ్రేయా ఇన్‌ఫ్రా అండ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పెట్టుబడి పథకాలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు హేమంత్‌కుమార్ రాయ్‌తో పాటు రాజేష్‌కుమార్, బ్రిజేష్‌కుమార్ మిశ్రాలను కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లక్నోలో అదుపులోకి తీసుకున్న నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. 2020లో లక్నోలో సంస్థను ఏర్పాటు చేసి తక్కువ కాలంలో పెట్టుబడులు రెండింతలు, మూడింతలు అవుతాయని నమ్మించి నెట్‌వర్క్ చైన్ విధానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో ఏజెంట్ల ద్వారా భారీగా పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన మొత్తంతో పాతవారికి చెల్లింపులు చేస్తూ మరింత మందిని ఆకర్షించినట్లు పేర్కొన్నారు. మే 2024 నుంచి చెల్లింపులు నిలిపివేసినట్లు తెలిపారు. బాధితుడు గుగులోత్ శివరాజు ఫిర్యాదుతో కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం సీపీ ఆదేశాలతో కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సెప్టెంబరు 18న లక్నోలో నిందితులను అరెస్ట్ చేసి, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుంది. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్‌గౌడ్, ఎస్ఐ డి. మహిపాల్‌రెడ్డి, సిబ్బందిని సీపీ గౌష్ ఆలం అభినందించారు. బాధితులు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు

- పేదల సీఎంఆర్ఎఫ్‌పై సీలింగ్ విధించడం అన్యాయం
- బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శ
- 34 మంది లబ్ధిదారులకు రూ.7 లక్షల చెక్కుల పంపిణీ



**కాకతీయ, ఖమ్మం :** పేదల ప్రాణాలు నిలిపే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులకు సీలింగ్ విధించి కోతలు పెట్టడం తీవ్ర అన్యాయమని బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. సీఎంఆర్ఎఫ్‌పై విధించిన పరిమితులను ప్రభుత్వం తొలగించాలని సూచించారు. తన సిఫారసు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన సుమారు రూ.7 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఖమ్మంలోని బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు ఎంపీ పంపిణీ చేశారు. వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై కోలుకున్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని రవిచంద్ర విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఏటా ప్రభుత్వ బడ్జెట్ నుంచి రూ.2,000 కోట్లు కేటాయించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎల్‌ఓసీలు, చెక్కులు అందించేవారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌పై సీలింగ్ పెట్టి కోతలు విధించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, సర్పంచ్ హరిప్రసాద్, పాల నాగేశ్వారరావు, లేడిబోయిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. రాబోయే 48 గంటలు కీలకంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. రెడ్ అలర్ట్ పరిధిలోని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువులు, కాలువల పరిసరాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది.

**ఉమ్మడి జిల్లాలపైనా ప్రభావం**

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, నల్గొండ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోనూ వర్ష ప్రభావం ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదైతే రహదారులు, లోతట్టు ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో అధికారులు పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వర్షంతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

**చెట్లు.. విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దు**

భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షం సమయంలో అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు కోతకు వచ్చిన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మార్కెట్ యార్డుల్లో నిల్వ ఉన్న ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి రక్షించుకోవాలని కోరారు. ఆకస్మికంగా వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ఏపీ తీరానికీ వాయుగుండం ముప్పు**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీరంపైనా ఉండనుంది. ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తీరప్రాంత లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వాయుగుండం కదలికతో తెలంగాణలో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున రాబోయే రెండు రోజులు కీలకంగా మారాయి. రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలు పాటించాలని కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షాలు తగ్గే వరకు ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు.

# నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు

- నోరి లక్ష్మీ భాస్కర్ పేరిట రూ.6.13 కోట్ల ఆస్తులు గుర్తింపు
- హైదరాబాద్‌లో 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఫ్లాట్‌లు, ఓపెన్ ప్లాట్లు, బ్యాంకు బ్యాలెన్స్‌లు.. బంగారు ఆభరణాలు
- 4 కార్లు, 2 ద్విచక్ర వాహనాలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు
- డీఆర్‌టీకి ముందు ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి
- ఇతరులకు రూ.1.33 కోట్లు అప్పుగా ఇచ్చినట్లు ఏసీబీ వెల్లడి



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. అవినీతి, అనుమానాస్పద మార్గాల్లో తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపిస్తూ తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. మంగళవారం ఆయన నివాసంతోపాటు మరో 7 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర అనుబంధ వ్యక్తులకు సంబంధించిన ప్రదేశాల్లో ఈ తనిఖీలు జరిగినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన స్థిర, చరాస్తుల మొత్తం విలువ రూ.6.13 కోట్లుగా ఏసీబీ పేర్కొంది. మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. కూకట్‌పల్లిలోని హైరిజ్ గేటెడ్ కమ్యూనిటీలో నాలుగు పడకగదుల ఫ్లాట్, అదే ప్రాంతంతోపాటు మణికొండ, పెట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో మొత్తం 5 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు.

**యాదాద్రి నుంచి విశాఖ వరకు ప్లాట్లు**

యాదాద్రి, నందిగామ, షామీర్‌పేట్ ప్రాంతాల్లో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నం నగరంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలను సోదాల్లో గుర్తించినట్లు ఏసీబీ తెలిపింది. స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో రూ.41 లక్షల నగదు నిల్వలు ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది. పోస్టాఫీసుల్లో రూ.12 లక్షల డిపాజిట్లు, ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్లలో రూ.29.55 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది. వీటితోపాటు సుమారు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు పేర్కొంది. సోదాల్లో నాలుగు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు ఏసీబీ తెలిపింది. ఒక జాగ్వార్, ఒక ఆడి, ఒక టాటా నెక్సాన్‌తోపాటు రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్, వెస్పా, యాక్టివా, యమహా వాహనాలు ఉన్నట్లు పేర్కొంది. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కూడా గుర్తించినట్లు వెల్లడించింది.

**ఫ్లాట్‌కు రూ.1.30 కోట్లు.. అప్పులుగా మరో రూ.1.33 కోట్లు**

డీఆర్‌టీకి ముందు స్వాధీనం చేసుకున్న ఫ్లాట్ కొనుగోలుకు రూ.1.30 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు ఏసీబీ తెలిపింది. మరో రూ.1.33 కోట్లను వివిధ వ్యక్తులకు చేతి అప్పులుగా ఇచ్చినట్లు గుర్తించినట్లు పేర్కొంది. అదనపు ఆస్తులకు సంబంధించిన వివరాలపై ప్రస్తుతం మరింత ధ్రువీకరణ కొనసాగుతోందని ఏసీబీ స్పష్టం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మరిన్ని వివరాలను సేకరించే పనిలో ఏసీబీ అధికారులు ఉన్నారు. గుర్తించిన ఆస్తులు, పెట్టుబడులు, బ్యాంకు లావాదేవీలు, ఇతర ఆర్థిక వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని ఏసీబీ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# వినయ్‌పై దాడిని సీరియస్‌గా తీసుకోవాలి

- ఘటనపై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరపాలి
- రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా విచారణ జరగాలి
- మెడికో లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి
- ప్రత్యక్ష సాక్షులు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



**కాకతీయ, హన్మకొండ :** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కోరారు. వైద్య పరీక్షలతో పాటు మెడికో లీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదిక, మెడికో లీగల్ నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన ప్రక్రియను చేపట్టాలని వినోద్ కుమార్ కోరారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు.

**ఆధారాల ఆధారంగా బాధ్యులను గుర్తించాలి**

ప్రజాప్రతినిధులపై దాడులు జరిగాయనే ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదని వినోద్ కుమార్ అన్నారు. బాధితుడి వాంగ్మూలం, వైద్య నివేదికలు, మెడికో లీగల్ నివేదికతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. విచారణలో ఎవరి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు బయటపడితే, వారికి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు ప్రజలు, ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా పోరాటం చేశారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పాలన, శాంతియుత వాతావరణం తెలంగాణ సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారనే ఫిర్యాదులు రావడం ఆందోళనకర అంశమని అన్నారు.

**పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించాలి**

ఈ ఘటనపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ కోరారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా విచారణ కొనసాగించాలని, అసలు ఏం జరిగిందనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించాలని అన్నారు. ఫిర్యాదులు, వైద్య నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా చట్టపరమైన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# డీజేలకు నో.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**చందుర్తి సీఐ రవీందర్ హెచ్చరిక**

**కాకతీయ, వేములవాడ:** గణేశ్ నిమజ్జనోత్సవాల్లో డీజేల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు చందుర్తి సీఐ రవీందర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చందుర్తి సర్కిల్ పరిధిలోని చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి మండలాల ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరిస్తూ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. ఊరేగింపులను ఉదయమే ప్రారంభించి రాత్రి 12 గంటల్లోపు పూర్తి చేయాలని సూచించారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ రవీందర్ హెచ్చరించారు.

# పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

- మాదిగ సామాజిక వర్గానికి బలమైన నాయకుడు
- కాంగ్రెస్ గెలుపునకు రామకృష్ణ కృషి చేశారు
- ఎంవీవీ కన్వీనర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్



**కాకతీయ, హనుమకొండ:** మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత, పేదల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విద్యావంతుల వేదిక (ఎంవీవీ) కన్వీనర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రామకృష్ణ ఎంతో కృషి చేశారని తెలిపారు. రామకృష్ణ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని, కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (క్మాక్స్) ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తున్నారని అన్నారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి వంటిదని, రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత తమదన్నారు. ఎమ్మెల్సీ అవకాశం లేదా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత సంఘాల నాయకులు మోరే ఐలయ్య, పోలేపాక రాము తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్ పిల్లల వార్డులో పేలిన ఏసీ

- ఎస్ఎన్‌సీయూలో ఏసీ నుంచి ఒక్కసారిగా పొగలు
- ప్రమాద సమయంలో 27 మంది నవజాత శిశువులు
- వెంటిలేటర్‌పై ఉన్న ప్రీటర్మ్ బేబీ, మరో పసికందు మృతి
- అద్దాలు పగలగొట్టి పసికందులను రక్షించిన సిబ్బంది
- ప్రైవేట్ ఆస్పత్రులకు హుటాహుటిన తరలింపు
- ఘటనాస్థలికి కలెక్టర్ రాజర్షి, ఎస్పీ.. సహాయక చర్యల పర్యవేక్షణ

**కాకతీయ, ఆదిలాబాద్ :** నిత్యం రోగులతో రద్దీగా ఉండే ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ విభాగం(ఎస్ఎన్‌సీయూ)లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం కలకలం రేపింది. ప్రమాద సమయంలో వార్డులో 27 మంది నవజాత శిశువులు ఉండగా.. ఒక్కసారిగా దట్టమైన పొగ అలుముకోవడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఏసీకి సంబంధించిన సమస్యతో పొగలు వ్యాపించినట్లు ప్రాథమికంగా అధికారులు చెబుతున్నప్పటికీ.. అసలు కారణం ఏమిటనేది సమగ్ర దర్యాప్తు తర్వాతే తేలుతుందని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, వైద్య సిబ్బంది స్పందించడంతోపాటు.. అక్కడే ఉన్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, రోగి సహాయకులు కూడా రక్షణ చర్యల్లో పాల్గొన్నారు. కిటికీల అద్దాలు పగలగొట్టి మరీ శిశువులను బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.

**క్షణాల్లో దట్టమైన పొగ**

ఎస్ఎన్‌సీయూలో ఏసీ నుంచి పొగలు రావడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి వార్డులో చీకటి అలుముకోవడంతోపాటు పొగ విపరీతంగా వ్యాపించింది. వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాల సహాయంతో చికిత్స పొందుతున్న పసికందులను బయటకు తరలించాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. విషయం గుర్తించిన సిబ్బంది ఆలస్యం చేయకుండా రక్షణ చర్యలు ప్రారంభించారు. ప్రమాద సమయంలో ఎస్ఎన్‌సీయూలో ఓ ప్రీటర్మ్ బేబీ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. అధికారుల ప్రకారం.. ఘటనకు ముందే ఆ శిశువుకు డెత్ డిక్లరేషన్ జరిగినట్లు తెలిపారు. అందువల్ల ఆ శిశువు మృతికి అగ్నిప్రమాదమే కారణమని ఇప్పుడే నిర్ధారించలేమని స్పష్టం చేశారు. ఘటన సమయంలో మరికొందరు శిశువులు కూడా వెంటిలేటర్ సపోర్ట్‌పై ఉన్నారు. వారిని అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించి అనంతరం ప్రైవేట్ ఆస్పత్రులకు షిఫ్ట్ చేశారు. చికిత్స పొందుతూ మరో చిన్నారి మృతి చెందింది

**అద్దాలు పగలగొట్టి పసిప్రాణులను రక్షించిన సిబ్బంది**

పొగ దట్టంగా అలుముకోవడంతో సాధారణ మార్గంలో శిశువులను బయటకు తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో కిటికీల అద్దాలు పగలగొట్టి లోపలికి వెళ్లేందుకు, పిల్లలను బయటకు తీసుకొచ్చేందుకు మార్గం సుగమం చేశారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌తో పాటు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. అక్కడే ఉన్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, రోగి సహాయకులు సైతం పిల్లలను కాపాడేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు. వెంటిలేటర్‌పై ఉన్న శిశువులను వైద్య పరికరాలతో సహా జాగ్రత్తగా తరలించారు.

**ఇతర వార్డులకు వ్యాపించకుండా మంటల అదుపు**

ఎస్ఎన్‌సీయూలో పొగలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. మంటలు ఇతర వార్డులకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. పొగను తొలగిస్తూ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో ప్రమాదం ఇతర విభాగాలకు విస్తరించకుండా నిలువరించగలిగారు. అగ్నిమాపక, పోలీసు, వైద్య సిబ్బంది సమన్వయంతో రక్షణ చర్యలు కొనసాగాయి. ప్రమాదం అనంతరం నవజాత శిశువులను తక్షణమే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. వెంటిలేటర్ సపోర్ట్ అవసరమైన శిశువులను ప్రత్యేక జాగ్రత్తలతో తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అక్కడ పీడియాట్రిషియన్లు ప్రతి నిమిషం వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత శిశువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

**కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ**

సమాచారం అందుకున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. నవజాత శిశువులను ఎలాంటి ఆలస్యం లేకుండా ఇతర ఆస్పత్రులకు తరలించాలని అధికారులకు సూచించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీసు విభాగం, వైద్య సిబ్బంది సమన్వయంతో చేపట్టిన చర్యలను పరిశీలించారు. ప్రమాదానికి ఎయిర్ కండిషనర్ కారణమై ఉండొచ్చన్న సమాచారం ప్రాథమికంగా మాత్రమే ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఏసీ కారణంగానే మంటలు చెలరేగాయా? విద్యుత్ వ్యవస్థలో లోపమా? లేక మరేదైనా కారణమా? అనేది పూర్తిస్థాయి దర్యాప్తు తర్వాతే తేలుతుందని తెలిపారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి అసలు కారణాలను నిర్ధారించిన తర్వాతే స్పష్టమైన సమాచారం వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ ఘటనతో రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ భద్రతా ఏర్పాట్లు, విద్యుత్ వ్యవస్థ, అగ్నిమాపక పరికరాల పనితీరు, అత్యవసర తరలింపు మార్గాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా వెంటిలేటర్ వంటి ప్రాణాధార పరికరాలపై చికిత్స పొందుతున్న నవజాత శిశువులు ఉన్న విభాగాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

**ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కొత్తగట్టు రాజేందర్**

**కాకతీయ, గీసుగొండ :** గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో,భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని గీసుగొండ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కొత్తగట్టు రాజేందర్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు నిమజ్జన ఏర్పాట్లను ముందుగానే సమన్వయం చేసుకోవాలని,మండపాల నుంచి విగ్రహాలను తరలించే సమయంలో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నిమజ్జనానికి తరలివెళ్లే భక్తులు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతియుతంగా వేడుకలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.నిమజ్జనానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులు,మహిళలు,వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీజేలు,సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో పోలీసులు, అధికారులు సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా మండపాల నిర్వాహకులు,భక్తులు పరస్పరం సహకరించి గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, విజయ వంతంగా నిర్వహించాలని కొత్తగట్టు రాజేందర్ పిలుపునిచ్చారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి అండగా బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ



**కాకతీయ, పెద్దవంగర :** కష్టాల్లో ఉన్న జర్నలిస్ట్ కుటుంబానికి తామున్నామంటూ బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలానికి చెందిన జర్నలిస్ట్ చింతల ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ విషయాన్ని తెలుసుకున్న సొసైటీ సభ్యులు మంగళవారం ఐలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి 46వెల రూపాయలు ఆర్థిక సహాయం అందించి అతని ముగ్గురు పిల్లలకు ఉచితంగా చదివిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ప్రసన్న కుమార్,ఉపాధ్యక్షులు మమతా రాణి,సభ్యులు వేణు, రాజు,యకమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతాహి పై విద్యార్థులకు అవగాహన




**కాకతీయ,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి లోని బాలికల గురుకుల విద్యాలయంలో స్వచ్ఛతే పై విద్యార్థినులకు మంగళవారం గాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తమ్మడపల్లి కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రేవంత్,స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం చెత్త ఉత్పత్తి అయ్యే చోట్ల లోనే తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా ఉండేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు చెత్తను బాధ్యతగా నిర్వహించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పార్థసారధి,పంచాయతీ కార్యదర్శి విజయ లక్ష్మీ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగం ఆరోపణలు అవాస్తవం

**బడి తండా సర్పంచి ధనమ్మ అమ్రూ నాయక్**

**కాకతీయ,నెల్లికుదురు :** నిధుల దుర్వినియోగం ఆరోపణల్లో నిజం లేదని నెల్లికుదురు మండలం బడి తండా సర్పంచి బిలావత్ ధనమ్మ అమృ నాయక్, ఉపసర్పంచి గుగులోతు చిట్టెమ్మ అన్నమయ్య తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తాము బడి తండ, శివారు చండాలలో చేసే అభివృద్ధి పనులను చూసి ఓర్వ లేక సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. రేగడి తండా పిఆర్ రోడ్డు నుంచి రాజేందర్ ఇంటి వరకు 25 ఫీట్ల వెడల్పు తో 550 మీటర్ల పొడవు రెండు ఫీట్ల ఎత్తుతో మొరం పోశామని, సొసైటీ తండాలో పిఆర్ రోడ్డు నుంచి గుగులోతు దాసు ఇంటి వద్దకు అక్కడి నుంచి ఉపసర్పంచి చిట్టమ్మ గృహం వరకు మొరం పోసి చదును చేసినట్లు తెలిపారు. దీనికి 450 ట్రిప్పుల మొరం జెసిబి, డోజర్లు వినియోగించామని తెలిపారు. చెట్లు తొలగించిన పనిలో చెరువు కట్ట హనుమాన్ టెంపుల్ నుంచి బాబా క్వారీ దగ్గరకు, బొడ్రాయి నుంచి క్వారీ రోడ్ వరకు రెండు జెసిబి యంత్రాలతో ముండ్ల కంప ఇతర వేస్ట్ చెట్లు రెండు జెసిబి యంత్రాలతో తొలగించినట్లు తెలిపారు. సంబంధిత పనులకు ఎంబీలు చేయించడం జరిగిందని నిధుల దుర్వినియోగం జరగలేదని సంబంధిత పనులు పరిశీలించుకోవచ్చని సర్పంచి, ఉపసర్పంచి తెలిపారు.



# వరంగల్ కేఎంసీ నర్సింగ్ కళాశాలలో వసూళ్ల కలకలం

- విద్యార్థుల నుంచి రూ.10 వేల వసూళ్ల ఆరోపణ
- డీఎంఈకి 10 పేజీల ఫిర్యాదు చేసిన విద్యార్థులు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- సీరియస్ అయిన వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ కు వివరణ కోరుతూ ఆదేశాలు




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) పరిధిలోని నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పెను కలకలం రేపుతున్నాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు, అలాగే పాసై వెళ్లిపోయిన విద్యార్థుల వద్ద నుండి కొందరు టీచర్లు రూ.10 వేల చొప్పున వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏ కారణంతో ఈ డబ్బులు వసూలు చేస్తున్నారనేది అంతుచిక్కకుండా ఉంది.

**10 పేజీల ఫిర్యాదుతో డీఎంఈకి లేఖ**

ఈ అక్రమ వసూళ్లను భరించలేక విద్యార్థులు సాహసించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) కి మెయిల్ ద్వారా ఏకంగా 10 పేజీలతో వివరణాత్మక ఫిర్యాదు చేసినట్లు సమాచారం. టీచర్ల వేధింపులు, డబ్బుల వసూళ్లపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థుల ఫిర్యాదుపై వైద్య ఆరోగ్య శాఖ సీరియస్ గా స్పందించింది. వెంటనే ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని కోరుతూ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కు ఆదేశాలు జారీ చేసింది. వసూళ్ల ఆరోపణలపై వివరణ కోరగా, విద్యార్థులు ఫిర్యాదు చేసిన విషయం నిజమేనని నర్సింగ్ ప్రిన్సిపాల్ అంగీకరించినట్లు సమాచారం. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, వాస్తవ వివరాలు వెల్లడిస్తానని ప్రిన్సిపాల్ తెలిపినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం కళాశాల వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# ఉత్కంఠభరితంగా మండల సర్వసభ్య సమావేశం

- ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసిన సర్పంచులు
- అంగన్‌వాడీల పనితీరు, విద్యుత్ కోతలపై ఆగ్రహం
- మండల ప్రత్యేక అధికారి వై. శ్రీకాంత్‌రెడ్డి




**కాకతీయ, రాయపర్తి:** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని మండల ప్రత్యేక అధికారి వై. శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఉత్కంఠభరితంగా సాగింది. మండల ప్రత్యేక అధికారి వై. శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో పాక శ్రీనివాసులు, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీవో సూచన ప్రకాష్, ఎస్‌ఐ ముత్యం రాజేందర్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు సంబంధిత అధికారులను నేరుగా ప్రశ్నించారు. గత సమావేశంలో అధికారులు ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ దృష్టికి తీసుకురావడంతో పలుమార్లు వాడీవేడిగా చర్చ జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించడం లేదని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పోషకాహారం అందడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి తెరవని కేంద్రాలపై తీసుకున్న చర్యలపై ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. వేలాపాల లేని విద్యుత్ కోతలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని విద్యుత్ శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు, మరమ్మతుల సమయంలో రక్షణ కోసం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్చులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రత్యేక అధికారి హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

# నాగేంద్రుడికి భాద్రపద మాస ప్రత్యేక పూజలు

- 27 నుంచి స్వామివారి మండల దీక్షలు ప్రారంభం
- ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు

**కాకతీయ, గీసుగొండ :** భాద్రపద మాసం రెండో మంగళవారాన్ని పురస్కరించుకుని నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఊకల్ హవేలి గ్రామంలోని శ్రీవల్లి దేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో భాద్రపద మాసం రెండో మంగళవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనా చార్యులు వైదిక మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు మాట్లాడుతూ భాద్రపద మాసంలో స్వామివారిని దర్శించుకుని వెండి కన్ను, పైడి కన్ను సమర్పించి పూజలు నిర్వహిస్తే కాలసర్ప దోషాలు తొలగి కార్యసిద్ధి కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వామివారి మండల దీక్ష మాల ధారణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మాల ధరించే భక్తులు మాలధారణకు ఒకరోజు ముందు ఉపవాసం ఉండి, మరుసటి రోజు నియమనిష్టలతో మాలధారణ స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిమ్మాపురం రాజేశ్వర రావు,కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, కమిటీ సభ్యులు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



# క్రీడాకారిణికి ఇనుగాల ఆర్థిక సాయం

- ఆసియా కప్‌కు ఎంపికైన సాయి వర్షిణి
- చైనాలో జరిగే అండర్-15 ఆసియా కప్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం
- ఆర్థిక ఇబ్బందులతో క్రీడా ప్రతిభ ఆగకూడదు
- : హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల



**కాకతీయ, హనుమకొండ :** చైనాలోని వుక్సీ నగరంలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న 5వ అండర్ 15 ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఆసియా కప్ 2026 పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్న హనుమకొండకు చెందిన క్రీడాకారిణి వెల్పుల సాయి వర్షిణికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ తరపున హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. సాయి వర్షిణి, ఆమె తండ్రి అనిల్‌తో పాటు హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిశారు. క్రీడాకారిణి ప్రతిభను గుర్తించిన ఆయన తక్షణ సహాయంగా నగదు అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ క్రీడాకారుడి ప్రతిభా ఆగిపోకూడదనే ఉద్దేశంతో సహాయం చేసినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా ఆడబిడ్డ అంతర్జాతీయ స్థాయిలో దేశం తరపున ఆడటం గర్వకారణమన్నారు. ఆసియా కప్‌లో సాయి వర్షిణి అద్భుతంగా రాణించి దేశానికి బంగారు పతకం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇతర దాతలు, క్రీడాభిమానులు కూడా ఆమెను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# మామునూర్ ఎయిర్‌పోర్టుకు అంబేద్కర్ పేరు పెట్టాలి

**కాకతీయ, నెల్లికుదురు :** ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్‌పోర్టుకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరును నామకరణం చేయలని జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ పునర్నిర్మాణము అవుతున్న మామునూరు ఎయిర్పోర్ట్ కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు నామకరణం చేయాలని మండల తాసిల్దార్ చందా నరేష్ ఎంపీడీవో సింగారపు కుమార్ లకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, అద్దంకి యువసేన మండల అధ్యక్షుడు బాణాల సంజీవ, పత్తి దర్గయ్య, బచ్చు సత్తయ్య, గార శ్రీను, గార జోష్, అశోద శశిధర్, మండల నాయకులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# భక్తి పేరుతో అశాంతికి తావివ్వొద్దు

- పగటి వేళల్లోనే నిమజ్జనం పూర్తి చేసుకోవాలి
- శంకరపట్నం ఎస్ఐ కట్కూరి శేఖర్‌రెడ్డి సూచన



**కాకతీయ, శంకరపట్నం:** వినాయక నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని శంకరపట్నం ఎస్ఐ కట్కూరి శేఖర్‌రెడ్డి మండల ప్రజలకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు వినియోగించవద్దని సూచించారు. వీలైనంత వరకు వెలుతురు ఉన్న సమయంలోనే నిమజ్జనం పూర్తి చేసుకోవాలన్నారు. నీటి వద్ద అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, యువత ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. మండపాల నిర్వాహకులు ముందుండి క్రమశిక్షణతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలన్నారు. “భక్తితో జరుపుకుందాం.. జాగ్రత్తగా నిమజ్జనం చేద్దాం.. క్షేమంగా ఇంటికి చేరుకుందాం” అని ఎస్ఐ శేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచి అశోక్ కుమార్**

**కాకతీయ,నెల్లికుదురు :** ఐసిడి అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి గుగులోతు అశోక్ కుమార్ గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు,కిశోరాలకు సూచించారు. మండలంలోని హనుమాన్ నగర్ తండా పరిధిలోని ధాన్య తండాలో సంబంధిత సెక్టార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసోత్సవంలో సర్పంచి పాల్గొన్నారు.. అంగన్వాడీలు ప్రదర్శించిన చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు ఏ ఏ పోషకాహారాలు తీసుకోవాలో బాలింతలకు, గర్భిణీలకు,కిశోరాలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శారద,మైబు నీలా,జయశ్రీ, ఆయా ఝాన్సీ,వార్డ్ సభ్యులు తండావాసులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాల్లో రక్తదానం

**జై భవాని కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం**



**కాకతీయ, హనుమకొండ :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కిషన్‌పుర జై భవాని కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరికిపండ్ల నవీన్, కునమల్ల సునీల్, దాసి రమేష్, కునమల్ల అఖిల్, వేములపల్లి రాజకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు యువకులు, భక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికగా మలచాలనే ఉద్దేశంతో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం ఎంతో ప్రాణదాయకమని పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జై భవాని కమిటీ సభ్యులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

# ఎంజీఎంలో వరుస ప్రమాదాలు.. రోగుల్లో భయాందోళన

- రెండు రోజుల్లో రెండు చోట్ల పైకప్పు పెచ్చులూడిపాటు
- ఆరోగ్యశ్రీ వార్డులో 8 మందికి గాయాలు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వరుసగా పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో రోగులు, సిబ్బందిలో భయాందోళన నెలకొంది. ఈ ఘటనలు ఇప్పుడు రాజకీయ రగడకు దారితీశాయి. రెండు రోజుల క్రితం ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో రోగులు, సిబ్బంది, సహాయకులు కలిపి 8 మంది గాయపడ్డారు. ఘటన మరువకముందే మంగళవారం ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లోనూ పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన వారిని



పరామర్శించేందుకు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎంజీఎంకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. మార్చురీ వద్ద ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో దాస్యం వినయ్ భాస్కర్ అస్వస్థతకు గురైనట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. మరోవైపు సీపీఎం ఆధ్వర్యంలో ఎంజీఎం ఎదుట బైఠాయింపు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోతన రోడ్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266